# అందమైన అంతఃకరణ...

- ఎ.సువర్ణ

"రేపు బెంగుళూరు వెళ్లాలి రాజీ... రావడానికో వారం పడుతుంది..." అన్న భర్త మాటలకు గాభరా పడిపోయా "ఏమిటి హరీ ఇది... ఈ సమయంలో ఈ టూర్ ఏమిటి? రేపు రాత్రికి మనింటికి ఆదు వస్తానని ఫోను చేశాడే... అతను మనింట్లో మూడు రోజులుంటాడే... అతనింట్లో వున్నప్పుడు నువ్వు ఇంట్లో వుండక పోతే ఎలా...?

"ఎలా ఏమిటి...? నువ్వుంటావుగా....!"

"డోంట్ బీ సిల్లీ హరీ.... ఆది ఎవరో తెలిసే అంటున్నావా ఈ మాటలు...?"

"ఓ... బాగా తెలిసే అంటున్నానోయ్...! ఆదినారాయణ మీ అత్తయ్య కొడుకు... మీ ఇద్దరూ చిన్నప్పటి నుంచీ ప్రేమించుకున్న గాథ ప్రేమికులు....

రాజేశ్వరి ఆదినారాయణ మేనత్త మేనమామ పిల్లలు... ఎన్నో కుటుంబాలలో మాదిరిగానే వాళ్లిద్దరూ పుట్టగానే వాళ్లిద్దరికి పెళ్లి చేస్తామని, వాళ్లిద్దరూ కాబోయే భార్యాభర్తలనే వాళ్ల చిన్న మనసులలో రెండు కుటుంబాలు వారు విత్తనాలు నాటారు... అవి ఆ చిన్ని హృదయాలలో లోతుగా నాటుకుని మొలకెత్తి దినదిన ప్రవర్థమానంగా వాళ్లతో పాటు ఎదిగినయ్.

రాజీ ఇంకా డిగ్రీ మూడో సంవత్సరంలో వుండగానే, ఆదినారాయణ ఎం.బి.ఎ పూర్తిచేశాడు. ఓ పెద్ద కంపెనీలో వున్న ఊళ్లోనే ఉద్యోగం దొరికింది... ఆది ఎంతో సరదా అయిన మనిషి. వసపిట్టలా ఎప్పుడూ కబుర్లు చెప్తాడు.... జోకులేసి అందరినీ నవ్విస్తాడు... ఎప్పుడూ ఒంటరిగా కనిపించడు... చుట్టూతా ఎప్పుడూ నలుగురు ఫ్రెండ్స్ వుంటారు. అతను చెప్పే జోకులకు నవ్వుతుంటారు. స్మార్ట్‌గా డ్రస్ చేసుకుంటాడు. ఫారిన్ సెంటు పూసుకుని ఘుమఘుమలాడుతుంటాడు. చుట్టాలెవరింటికైనా వెళ్లి నాలుగు రోజులు గడిపి వచ్చాడంటే అతనున్న గది పడుకున్న బెడ్ అతనెళ్లిన నాలుగురోజుల దాకా అతను రాసుకున్న సుగంధ భరిత ఫారిన్ సెంట్ పరిమళాలను వెదజల్లుతూనే వుంటాయి.

రాజీకి అతను రాసుకునే సెంట్ పరిమళాలంటే మహాఇష్టం. ఎప్పుడెప్పుడు తనకు ఆదూతో పెళ్లి అవుతుందా ఆ మూడు ముళ్లు ఎప్పుడేస్తాడో, ఆ సెంటు వాసన దూరం నుంచీ కాకుండా బావ కౌగిట్లోంచి... ఆ సుగంధ పరిమళాలను ఆస్వాదిస్తానా అని తహతహలాడింది రాజీ... ఆదినారాయణది ఇంచుమించు అదేస్థితి.... కాదు... కాదు.. పూర్తిగానే..!

రెండు కుటుంబాల వారు ఆధునికులైనప్పటికీ, సాంప్రదాయాలను గౌరవించి విలువ ఇస్తారు... రాజీ-ఆది ఇంకా దంపతులు కాక పోవడం వల్ల ఇద్దరికీ వింతగా ఒకరి పొందు కోసం ఇంకొకరు తహతహలాడుతున్నా గుర్రాన్ని కట్టేసి తమిద్దరిని ఒకటి చేసే ఆ శుభఘడియ కోసం ఓపికగా కాచుకున్నారు.

కానీ భగవంతుడు వేరు విధంగా అనుకున్నాడు... జాతకాల పేరుతో ప్రేమికులను నిర్దాక్షిణ్యంగా వేరు చేశాడు.

పెళ్లి ముహూర్తం పెట్టే ముందర ఎందుకైనా మంచిదని రెండు కుటుంబాల వారు తమ పిల్లల జాతకాలు కుటుంబ జ్యోతిష్కులకు చూపించి 'వాళ్ల జాతకాలు కలిసినయ్యా వాళ్ళ పెళ్లి చెయ్యవచ్చునా' అని అడిగారు... వాళ్లిద్దరి జాతకాలు ఎంతమాత్రం కలవలేదని వారికి పెళ్లిచేస్తే వాళ్ల దాంపత్యం ఎంత మాత్రం అన్యోన్యంగా వుండక పోగా ఎన్నో సమస్యల నెదుర్కోవలసి వస్తుందని, అందుకని వారికి వివాహం చెయ్యక పోవడమే మంచిదని చెప్పేసరికి ఇరు కుటుంబాల వారికి ఏం చెయ్యాలో తోచలేదు.

ఆది-రాజీల హృదయాలు ముక్కలు ముక్కలుగా పగిలి పోయినయ్యి. రాజీ అయితే రెండు రోజులు నిద్రాహారాలు మానేసి ఒకటే

ఏడుపు.... జాతకాలు చూపించ కుండా వాళ్ళ పెళ్లి చేసేసుంటే ఈ సమస్య వచ్చేది కాదు... తీరా చూపించాక వాళ్ల జాతకాలు కలవలేదు. పెళ్ళి చెయ్యవద్దన్నాక పెద్దలు ధైర్యం చెయ్యలేక పోయారు.

"మాకు జాతకాల మీద నమ్మకం లేదు. మేము పెళ్లి చేసుకుంటాము" అని మీరనుకుంటే మాకేం అభ్యంతరం లేదు... కానీ ఆ తరువాత మీకేమైనా సమస్యలొస్తే మాత్రం మేము పరిష్కరించలేమని, ఇద్దరి తల్లితండ్రులు పెద్దలు ఖచ్చితంగా చెప్పాక వాళ్ళనెదిరించి ఆదూ-రాజీ దంపతులు కాలేక పోయారు.

కాలమే అన్ని గాయాలను నయం చేస్తుందన్నట్టు మూడు నాలుగు నెలలలో ఇద్దరూ మామూలు మనుష్యులయ్యారు.

అన్నివిధాల రాజీ జాతకంతో సరిపోయిన శ్రీహరితో రాజీ పెళ్లి అయింది. తరువాత ఆరు నెలలకు ఆదినారాయణకు అనితతో వివాహం అయింది.

శ్రీహరి చదువు విషయంలోకానీ ఉద్యోగ విషయంలో కానీ ఆదినారాయణ కంటే కాస్త పై మెట్టుమీదే వున్నాడు. స్వభావంలో మాత్రం ఆదూకు పూర్తి విరుద్ధం... ఆదు ఎప్పుడూ గలగలా మాట్లాడుతూ జోక్స్ కట్స్ చేస్తూ అందర్నీ నవ్విస్తే, శ్రీహరి ఎంతో రిజర్వుడుగా వుంటూ ఎక్కువగా మాట్లాడడు. స్మార్ట్‌గా డ్రస్ చేసుకోడు. సెంటు అసలు రాసుకోడు... లోతైన స్వభావం... శాంతచిత్తుడు... దేనికీ కోపం తెచ్చుకోడు... మొహాన ఎప్పుడూ చిరునవ్వుల చిందులాడుతుంది.

పెళ్లికి ముందుకానీ తరవాత కానీ తమ ప్రేమ వ్యవహారం రెండో మనిషి వల్ల శ్రీహరి తెలుసుకునేకంటే తనే ముందుగా అన్ని విషయాలు చెప్పెయ్యడం మంచిదను కున్న రాజీ పెళ్లికి ముందే ఆదీ తను చిన్ననాటి నుంచీ పెద్దలు చేసుకున్న వాగ్దానాల ఫలితంగా ప్రేమించుకున్నామని, జాతకాల మూలంగా ఆ పెద్దలే తమని పెళ్లికి దూరం చేశారని అన్ని విషయాలు పూస గుచ్చినట్లు చెప్పింది.

"దట్సాల్ రైట్ రాజేశ్వరి గారూ.... మీరు నన్ను పెళ్లి చేసుకున్నాక మిమ్మల్ని నేనెంత మాత్రం అనుమానించను. బాధపెట్టను" అన్న అతను అన్నమాట నిలబెట్టుకున్నాడు మూడు సంవత్సరాల దాంపత్య జీవితంలో...

పెళ్లి అవగానే ఆదినారాయణ చెన్నైకి వెళ్లిపోయాడు వేరే ఉద్యోగం వెతుక్కుని.... అలా వెళ్లినతను మూడు సంవత్సరాల తరువాత మొదటిసారిగా వస్తున్నాడు రాజీని చూసేందుకని...

అలాంటి సమయంలో భర్త బెంగుళూరు వెళ్లడం రాజీకి నచ్చలేదు. అదే అన్నది.

"నేను లేకపోతే ఏం రాజీ.... మీ ఇద్దరూ మాట్లాడుకునేందుకు ఎన్నో విషయా లుంటయ్యి. చాలా కాలం తరువాత కలుసుకుంటున్నారు..." అన్న అతని మాటలలో దెప్పిపొడుపు ఏ మాత్రం లేదు.... ఆదినారాయణ పెళ్లిలో తనే పెళ్లి పెద్దఅయినట్లుగా అన్నిపనులు నెత్తినేసుకుని చెయ్యడం వల్ల రాజీకీ భర్తయందు ఎంతో భక్తిభావం కూడా ఏర్పడింది.

చాలాకాలం తరువాత ఆదు తమింటికి వస్తున్నాడు, అదీ ఒంటరిగా... ఈయనకు అప్పుడే ఆఫీసు పనిమీద చెన్నై వెళ్లాల్సిన నిర్బంధం.

భర్తను కాస్త ఉడికించాలనుకున్న రాజీ తనే ఆ వలలో పడతానుకోకుండా.. ఏమిటి హరీ మీరు మరీనూ.... ఆది ఎవరైందీ మరచిపోయారా... నా పూర్వ ప్రేమికుడని... అతనితో నేను మూడు రోజులు ఒంటరిగా ... అదీ అతనితో ఏకాంతంగా నేను గడపడం... మీకేం అనిపించడం లేదూ...! ఆక్షేపణ లేదా...!" అన్న భార్యను అందంగా చూస్తూ... "చూడు రాజీ, ఆదినారాయణ నీ పూర్వ ప్రేమికుడన్న విషయం నేను మరచి పోలేదు... అందుకే నేనా సమయంలో మీ మధ్య వుండక పోవడమే మంచిది...." అన్న భర్త మాటలకు భార్య మొహం అభి మానంతో ఎర్రపడింది.

"నేనేదో తమాషా కంటే... మీరేమిటి ఇలా అంటారు...?" అన్నది రాజీ కోపంగా.

"కోప్పడకు రాజీ... కోపం తెచ్చుకోకుండా

నే చెప్పేది పూర్తిగా వినాలి రాణీగారు... మీరిద్దరూ ఇలా ఏకాంతంలో కలుసుకుని పరస్పరం ఫేస్ టూ ఫేస్ కూర్చుని మీ మనసు లోతులలో దాగున్న కొన్ని స్పందనలు పంచుకునేందుకు దొరికే అవకాశం....." అన్న భర్త మాటలు ఏం అర్థం కాక అతన్ని అర్థం అయ్యేట్లు చెప్పమన్నట్లుగా చూసింది రాజీ.... అర్థం అయ్యేట్లు చెప్పాడు శ్రీహరి.

"రాజీ, నువ్వు నన్ను పరిపూర్ణమైన నిండు మనసుతో భర్తగా స్వీకరించినప్పటికీ, నీ మనసు పొరలలో ఆదూ వున్నాడు. అతని మీది ప్రేమ వుంది...." అన్న భర్త మాటలకు తలవంచుకుని మౌనంగా వుండిపోయింది మౌనం అర్థాంగీకారం అన్నట్లుగా.

అన్ని విషయాలు బాగా లోతుగా పరిశీలించి అర్థం చేసుకో గలిగిన భర్త మనస్తత్వం తెలిసిన రాజీ తను దొంగగా అతనికి పట్టు పడతానని ఎంత మాత్రం ఊహించలేదు. ఆమె అదే అన్నది.

"అవును హరీ, నేను మీరన్నమాటను కాదనలేను... కానీ అది తల్చుకుంటేనే నాకు సిగ్గుగా వుంది. అయినా హరీ నా మనసు అట్టడుగు పొరలలో దాగిన ప్రేమను ఎలా కనిపెట్ట గలిగారు..." తలవంచుకునే అడిగింది రాజీ.

"నువ్వందుకు తలవంచుకోనక్కర లేదు రాజీ...! ఆదూ మీది నీ ప్రేమను నేను ఎలా తెలుసుకోగలిగానన్నదేగా నీ సందేహం...? అదేమంత కష్టం కాదు... అతి తేలికగా ప్రతీ సందర్భంలో నువ్వే పట్టు పడ్డావు... తేలికగా అందరి సైకాలజీలు తెలుసుకునే నాకు నీ మనసుని తెలుసు కోవడం పెద్ద కష్టమా...? నీ కళ్లు ఎంతో ఎక్స్‌ప్రెసీవని నేను ఎన్నోసార్లు వర్ణించాను. నీ కళ్లలోని ఆ ఎక్స్‌ప్రెస్‌నెస్ తోనే నేను నీ మనసుని కనిపెట్ట గలిగాను... ఎన్నో సందర్భాలలో నీ కళ్లే నిన్ను నాకు పట్టిచ్చినయ్యి.....!

అదెలా అన్నట్టుగా భర్తను చూసింది. ఆమె చూపులను అర్థం చేసుకున్నతను చెప్పాడు.

"ఆదినారాయణ గురించి ఎప్పుడూ మాట్లాడినా నీ కళ్లలో కనిపించే ప్రకాశం... అతని పెళ్లిలో అతని భార్య నీ కన్నా ఎక్కువ చదువుకోనిది, నీకంటే అందమైంది కాదని నీ కళ్లలో కనిపించిన గర్వం, తృప్తి.

"ఫోనులో మీ తల్లిదండ్రులతోనూ, మద్రాసులో వున్న మీ కజిన్ సిస్టర్‌తో మాట్లాడేటప్పుడు నువ్వు తప్పకుండా ఆదినారాయణ గురించి మాట్లాడకుండా వుండ లేవు... అలా మాట్లాడేటప్పుడు నీ కళ్లు చిందే వెలుగులు... కానీ నేనది కనిపెట్టకూడదని, గొంతులో రాని నిర్లక్ష్యాన్ని ధ్వనింప చేసే వ్యర్థ ప్రయత్నం చేస్తావు.... లే నేను కనిపెట్టేది నీ కళ్లనుంచని తెలియక... ఇన్ని క్లూస్ చాలవా నేను నీ మనసు లోతులను తెలుసుకునేందుకు.... నీకింకా అతని మీద ప్రేమ వుందనడానికి...? అన్న శ్రీహరి ఇంకా ఏం మాట్లాడని భార్యను చూస్తూ.... రాజీ ఇందుకు నువ్వు తప్పు చేస్తున్నట్లుగా సిగ్గుపడవలసిందేం లేదు... ఇందుకు నీకో ఉదాహరణ చెప్తాను.

"రాజీ మనం ఓ లడ్డు, జిలేబీ, జామూన్ తీపి పదార్థాలు తింటాము.... చాలా సేపటివరకు ఆ తీపి మన నోట్లో వుంటుంది... ఈ ప్రేమ అలాంటిదే... నువ్వు గాఢంగా ప్రేమించిన ఆదినారాయణ మీది ప్రేమ జ్ఞాపకాలు కొంతకాలం నీ మనసులో వుంటయ్యి.

## శిష్యోపద

పంచదారకన్న పనస ఫలముకన్న
తియ్యదనము గురువు తేట మాట
పాలరాతికన్న పసిమి మీగడకన్న
చల్లదనము గురువు చల్లని మది

గురువు తోడ విద్య గుణవర్ధనమగును
గురువు మార్గదర్శి తరచిచూడ
గురవు కర్తకర్మ గురువు కల్పతరువు
అట్టి గురువు కొలువు అనుదినంబు
(సెప్టెంబరు 5 గురు పూజాదినోత్సవం)

–జె. కొండన్న

"మరోవైపు నా అందమైన అంతఃకరణ నీకెంతో తృప్తి అనిపించినా, నా ట్రాన్స్ పరెంటెనెస్ నీకు బాధగానూ వుంది. అవమానంగానూ వుంది... మరో వైపు నా భర్తకు ఈర్ష్యాసూయాలు లేనే లేవా... అని నీకు సందేహం రావచ్చును...!

"వున్నయ్యి.... మొదట్లో... పెళ్లిఅయిన కొత్తలో నీ ప్రేమను పొందిన ఆదినారాయణంటే నాకు చాలా ఈర్ష్యగానే వుండేది. నేను ఆదిలాగా స్మార్ట్‌గా డ్రస్ చేసుకోనని, సెంటు రాసుకోనని నీ కళ్లలో కనుపించే నిరాశవల్ల కొంత తెలుసుకున్నా. ఒక్కోసారి మాటల సందర్భంలో దాన్ని ఇన్ డైరెక్టుగా అన్న మాటల వల్ల నాకు పూర్తిగా అర్థం అయి నీ తృప్తి కోసం ఆదిలా వుండే ప్రయత్నం చేసినా పూర్తిగా అతన్ని కాపీ కొట్టడం నా వల్ల కాలేదు... సెంటు వాసనే గిట్టని వాడిని నేనెలా సెంటు రాసుకోగలను... బయటి వేషాలకు మనిషి ఆకర్షింపపడడం సహజం... కొంతమంది సినిమా స్టార్సు మాధవన్ సిమ్రాన్‌ల ఆకర్షణలకులోనై వాళ్ల ఫొటోలు , పోస్టర్లు ఇంట్లో గోడలకు తగిలించుకోవడం లేదూ...!

"అందుకని భర్తలందరూ మాధవన్‌లను, భార్యలందరూ సిమ్రాన్‌లను అనుకరించమంటే సాధ్యపడుతుందా రాజీ....?".

"సరే హరీ నీ వాదన బాగానే వుంది కానీ నన్నిప్పుడేం చెయ్యమంటారు.. మహానుభావా...?.

"దట్స్ గుడ్... రేపు ఆదీ రాగానే నీ మనసులో అతని మీద నీకున్న భావాలన్నీ బయట పెట్టేసి భారం దించేసుకో... ఆ తరువాత అతని ఆలోచననేదే నీ జీవితాంతం నీ మనసులోకి రాదు... గుడ్‌లక్... ఆల్ ద బెస్ట్.... అని శ్రీహరి వెళ్లిపోయాడు.

మర్నాడు ఇంకా పూర్తిగా తెల్లవారకముందే కాలింగ్ బెల్ మోగడం వినిపించి రాజీకి నిద్ర మెలకువ వచ్చింది. బద్ధకంగా లేచి వెళ్లి వాకిటి తలుపులు తెరిచింది.

ఆదినారాయణతో పాటు అనిత లోపలకొచ్చింది. ఆమె కూడా రావడం రాజీకి ఆశ్చర్యంగా వున్నా అది అడగడం బాగుండదనీ... రా ఆదూ, రండి అనితా.. అని లోనికి ఆహ్వానించింది.

అలవాటు ప్రకారం ఉభయులు కుశల ప్రశ్నలై కాఫీలు తాగాక అనిత స్నానం చేసి వస్తానని బాత్‌రూమ్‌లోకి వెళ్లింది.

"ఏం ఆదూ నిన్న సాయంత్రం ఫోనులో మాట్లాడినప్పుడు నువ్వు ఒక్కడివే వస్తానన్నావుగా.." రాజీ ఆదినారాయణను అడిగింది.

"నువ్వు శ్రీహరి బెంగుళూరు వెళ్లాడని చెప్పావుగా..! అనితకు మన ప్రేమ విషయాలు, పెళ్లి కాకపోవడానికి కారణాలన్నిటినీ వివరంగా చెప్పాను. అప్పటి నుంచీ నన్ను నమ్మదు.

"నేను అనితను పెళ్లి చేసుకున్న రోజునే నిన్ను నా మనసులోంచి పూర్తిగా చెరిపేశాను... అక్కడ అనితను ప్రతిష్ఠించుకున్నాను... కానీ నమ్మదే... సర్వకాల సర్వావస్థలందూ నన్ను అనుమానిస్తూ నాకు మనశ్శాంతి లేకుండా చేస్తోంది... అందుకనీ మీ ఆయన ఊళ్లో లేరని తెలియగానే ఆఖరి నిమిషంలో తనూ వస్తానని గోల చేసేసరికి రైలు టిక్కెట్టు కాన్సిల్ చేసుకుని ఇద్దరం కలిసి బస్సులో వచ్చాము.

అయ్యో పాపం... అని మనసులోనే అతనికోసం బాధ పడింది రాజీ.

మనసులను, వాటిలోని భావాలను అర్థం చేసుకుని, ఆ మనసు అట్టడుగు పొరలలో దాగి వున్న స్పందనలను తెలుసుకుని అవి బయటకు వొచ్చే విధంగా మాట్లాడే శ్రీహరెక్కడ... లేనివేవో వూహించుకుని మనసుని చిన్నదిగా ఊహించుకుని భర్తను బాధించే అనితెక్కడా.... ఆమె మనసుని విశాలం చెయ్యాలనుకుంది రాజీ.

"బాధ పడకు ఆదూ.... ఇంకో రెండు మూడు రోజులు... అహ... కాదు. శ్రీహరి వచ్చేంతవరకు మీరిద్దరూ ఇక్కడే వుండండి.. అన్న "రాజీ మెల్లగా ఆదుకు మాత్రం వినపడేట్లుగా హరి రాగానే మేమిద్దరం కలిసి అనిత మనసులోని అనుమానాన్ని వేళ్లతో సహా పీకి పారేస్తాను..." అన్న రాజీని కృతజ్ఞతతో చూస్తూంటే అనిత ఆ చూపులకు భర్తమీద వళ్లు వటవటా కారుకుతున్నది.